నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 23 డిసెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

## వాలీబాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

సూర్యాపేట, డిసెంబర్ 22 : ప్రతిభ ఉన్న వెలుగులోకి రాని గ్రామీణ స్థాయి క్రీడాకారులు సీఎం కప్‌లాంటి క్రీడలను ఉపయోగించుకోవాలని, వారి ప్రతిభను గుర్తించి సెలెక్షన్ చేయాలని సూర్యాపేట అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వాలీబాల్ పోటీలతోపాటు సీఎం కప్ కోసం ఉమ్మడి నల్గొండ జిల్లా జట్టును సెలెక్షన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 30వరకు ఖమ్మంలో జరిగే సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టును పంపిస్తామని తెలిపారు. అందుకు ఉమ్మడి జిల్లా పరిధిలోని మూడు జిల్లాల జట్లకు వాలీబాల్ పోటీలు నిర్వహించి క్రీడాకారు ఎంపిక జరుతుందని చెప్పారు.

గ్రామీణ క్రీడాకారులు రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగాలని సూచించారు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి రామచంద్రరావు, అజాంబాబు, మల్లేశం, విశ్వజ్ఞచారి, రామ్మోహన్‌చారి, సీతారాంరెడ్డి, కిరణ్‌కుమార్, ఏడుకొండలు, మైసయ్య, రవి, రవితేజరెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గపోరు..!

**ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తీరుపై యూత్ కాంగ్రెస్ తీవ్ర వ్యతిరేకత**

- మోటకొండూర్‌లో ఎమ్మెల్యే లేకుండానే ర్యాలీ, సన్మాన కార్యక్రమాలు
- గుండాలలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కరపత్రం విడుదల
- ఇటీవల యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో బీర్ల అయిలయ్యకు చుక్కెదురు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రకటించిన అభ్యర్థులకు వ్యతిరేక ప్రచారం చేసే యోచన

యాదగిరిగుట్ట, డిసెంబర్ 22 : కాంగ్రెస్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు తన పార్టీలోనే వ్యతిరేకత పెరిగింది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఆయన తీరుపై ఆ పార్టీకి చెందిన కొంత మంది యూత్ విభాగం నాయకులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. పార్టీ క్యాడర్‌లో విభేదించి పరిగణించడం, గ్రామాల్లో వర్గాలుగా విభజించి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్న నాయకత్వాన్ని తక్కువ చూడటం, నూతనంగా పార్టీలోకి వచ్చిన వ్యక్తులను అందలం ఎక్కించడం లాంటి వాటిపై యూత్ విభాగం నాయకులు ఎమ్మెల్యేపై గుర్రుగా ఉన్నారు. కొంత మంది సీనియర్ నాయకులు అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు మోటకొండూర్ మండల కేంద్రంలో ఆదివారం నూతనంగా ఎన్నికైన మండల యూత్ కాంగ్రెస్ కమిటీ సభ్యుల సన్మానం, భారీ ర్యాలీ వంటి కార్యక్రమాలు ఎమ్మెల్యేపై ఎంత వ్యతిరేకత ఉందో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ఆహ్వానం లేకపోవడం, ఫ్లెక్సీలో ఆయన ఫొటో సైతం లేకుండా ముగించారు. ఈ కార్యక్రమాన్ని ఆ పార్టీ మోటకొండూర్ కాంగ్రెస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు శిరబోయిన మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రకటించిన అభ్యర్థులను ఓడించేందుకు సైతం వెనుకాడటం లేదని తెలుస్తున్నది. ఇటీవల మొత్కూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి గెలుపుకోసం కష్టపడ్డవారిని సైతం పక్కనబెట్టి ప్యారాచూట్ నాయకుడికి కట్టబెట్టడంపై గుండాల మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తీరు సరైంది కాదని కరపత్రాన్ని విడుదల చేశారు.


మోటకొండూర్‌లో ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

### ఎడమొహం..పెడమొహం

ఆలేరు నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో ఒక్కటిగా నిలిచి గెలుపునకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ఇప్పుడు పూర్తిగా ఎడమోహం పెడమోహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అనుసరిస్తున్న తీరు ప్రధాన కారణమని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గంలో 8 మండలాల్లో ఇదే తీరు కనబడుతున్నది. గతంలో పార్టీ కోసం పనిచేసిన సీనియర్ యువతను ఆయన పట్టించుకోకపోవడంతోపాటు తన సామాజిక వర్గానికి చెందిన నూతన వ్యక్తులు, బంధువులు, పార్టీకి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులను అందలమెక్కిస్తున్నారన్న ఆరోపణ ప్రధానంగా వినబడుతున్నది. కరోనా సమయంలో ఆయనకు వెన్నంటి ఉన్న యువతను పూర్తిగా విస్మరించి బంధుగణానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వడం పట్ల యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడుతున్నారు.

### యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో బీర్ల అయిలయ్యకు చుక్కెదురు..

ఇటీవల యూత్ కాంగ్రెస్ ఎన్నికలను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. పారదర్శకంగా నిర్వహించిన ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు చుక్కెదురైంది. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బొమ్మలరామారం మండలానికి చెందిన నందరాజు గౌడ్‌ను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పోటీకి దింపారు. ఈయనకు వ్యతిరేకంగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వర్గానికి చెందిన భువనగిరి మండలంలోని చీమలకొండూర్ గ్రామానికి చెందిన మంగ ప్రవీణ్ పోటీకి దిగి విజయాన్ని సాధించారు. దీంతో జిల్లా యూత్ కాంగ్రెస్‌లో బీర్లకు ప్రాధాన్యత తగ్గినట్లయ్యింది. దీంతోపాటు ఆలేరు నియోజకవర్గంలో 8 మండలాల్లో సైతం తన ప్యానల్‌తో యూత్ విభాగాన్ని చేజిక్కించుకునే ప్రయత్నంలో పూర్తిగా విఫలమైనట్లుగా తెలుస్తున్నది. పోటీలోకి దించిన నాయకులంతా తక్కువ మెజారిటీతో గెలుపొందారు. తన అధికార బలాన్ని వినియోగించి 8 మండలాల్లో కేవలం 5 మండలాలు మాత్రమే ఎమ్మెల్యే అనుచరులు విజయం సాధించారు. ఇందులో ఆలేరు, బొమ్మలరామారం, మోటకొండూర్ మండలంలో ఆయనకు వ్యతిరేక వర్గానికి చెందిన నాయకులు గెలుపొందారు. ఇందులో అయన పలుకుబడితో ఆలేరు, బొమ్మలరామారం మండలాలకు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులను తనవైపు తిప్పుకున్నారని సమాచారం. కాగా మోటకొండూర్ మండల యూత్ కాంగ్రెస్ మాత్రం ఆయనకు వ్యతిరేకంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మోటకొండూర్‌లో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు వ్యతిరేకంగా పోటీలో నిలిచి గెలిచిన జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంగ ప్రవీణ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గెలుపొందిన బుగ్గ శ్రీనివాస్‌తోపాటు ఆ పార్టీకి చెందిన కొంత మంది కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆదివారం ఆ పార్టీ మోటకొండూర్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు శిరబోయిన మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో సన్మానం కార్యక్రమంతోపాటు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను ఆహ్వానించలేదు. పైగా ఆయన వర్గమని చెప్పుకునే ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులను సైతం యూత్ కాంగ్రెస్ పక్కనపెట్టింది. ఎమ్మెల్యేగా గెలిచినా ఆయనకు యూత్ విభాగం నాయకులు దాదాపు పట్టించుకునే పరిస్థితి లేదని తేలిపోయింది. మోటకొండూర్ మండల కేంద్రంలో జరిగిన యూత్ కాంగ్రెస్ ర్యాలీ, సన్మానం వంటి కార్యక్రమాలు దాదాపు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగానే జరిగాయని కార్యక్రమాన్ని వీక్షించిన పలువురు గుసగుసలాడుకున్నారు.

### గుండాలలో కరపత్రం వరకు చేరిన మార్కెట్ కమిటీ ఎన్నిక వివాదం

గుండాల మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నూనె ముంతల విమలావెంకటేశ్వరగౌడ్ మోత్కూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పని చేసిన సీనియర్ నాయకులకు బీర్ల అయిలయ్య తీవ్ర అన్యాయం చేశారని పార్టీ సీనియర్ నాయకులకు కాదని వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌లో స్థిరపడిపోయిన వ్యక్తికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కట్టబెట్టారని కరపత్రాలను విడుదల చేశారు. మార్కెట్ కమిటీని రద్దు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరకు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

# ఖతర్నాక్ కలెక్టర్

**పరిపాలనలో హనుమంతరావు దూకుడు**

**నిత్యం క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు**

**హాస్టళ్లు, ఆస్పత్రులు, పాఠశాలల సందర్శన**

- విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే అంతే సంగతులు
- సస్పెన్షన్లు, నోటీసులతో స్టాఫ్‌లో దడ
- సమీక్షలు, సమావేశాలతో బిజీబిజీ
- విద్య, వైద్యం బలోపేతంపై స్పెషల్ ఫోకస్


భువనగిరి ఎస్సీ గురుకులంలో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు(ఫైల్)

*ఆయనొచ్చి సరిగ్గా 52 రోజులే.. అలసత్వంగా ఉన్న అధికారులు, కింది స్థాయి సిబ్బందికి ముచ్చెమటలు పట్టిస్తున్నారు. జిల్లాలో అందరికీ హడల్ పుట్టిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలతో దూకుడు ప్రదర్శిస్తున్నారు. విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా వెనువెంటనే సస్పెన్షన్లు, నోటీసులు, హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నిత్యం పర్యటనలు, సమీక్షలు, సమావేశాలతో జిల్లాను సెట్‌రైట్ చేస్తున్నారు కలెక్టర్ ఎం. హనుమంత రావు.*

*– యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ)*

ఈ ఏడాది అక్టోబర్ 29న కలెక్టర్‌గా ఎం.హనుమంత రావు బాధ్యతలు స్వీకరించారు. సమాచార శాఖ కమిషనర్‌గా ఉన్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చారు. అంతకు ముందున్న కలెక్టర్ హనుమంతు జెండగే టూరిజం శాఖ ఎండీగా వెళ్లారు. సరిగ్గా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి రెండు నెలలు కూడా పూర్తి కాలేదు. కానీ జిల్లా పాలనలో తనకంటూ ముద్ర వేసుకున్నారు. అంతకు ముందు సంగారెడ్డి కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో తనదైన శైలిలో దూసుకెళ్తున్నారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నారు.

### నిత్యం ఆకస్మిక తనిఖీలు.. సస్పెన్షన్లు..

జిల్లాలో కలెక్టర్ నిత్యం ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఎంతలా అంటే ఎప్పుడు, ఎక్కడ తనిఖీలకు వెళ్తారో కనీసం ఆయన కార్ డ్రైవర్‌కు కూడా తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే అప్పటికప్పుడే సస్పెండ్ చేస్తున్నారు. మరికొందరికి మెమోలు, నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పటి వరకు పదుల సంఖ్యలో ఉద్యోగులను సస్పెండ్ చేశారు. ఇటీవల భువనగిరి గురుకుల పాఠశాలలో కేర్ టేకర్ సస్పెన్షన్‌తో పాటు ప్రిన్సిపాల్‌కు నోటీసులు జారీ చేయడం రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యింది.

### విద్య, వైద్యంపై స్పెషల్ ఫోకస్..

కలెక్టర్ హనుమంతరావు జిల్లాలో ప్రధానంగా విద్య, వైద్యంపై ఫోకస్ పెట్టారు. గురుకులాలు, హాస్టళ్లలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఏకంగా నారాయణ పురంలోని ఎస్సీ హాస్టల్‌లో రాత్రి నిద్ర చేశారు. ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ బడుగుల బాగోగులు, పని తీరుపై ఆరా తీస్తున్నారు. స్కూళ్లలో చాక్ పీస్ చేతబట్టి విద్యార్థులకు స్వయంగా పాఠాలు చెబుతున్నారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపుతున్నారు. ఇక ప్రభుత్వ ఆస్పత్రులను గాడిలో పెడుతున్నారు. ఏరియా ఆస్పత్రులతోపాటు పీహెచ్సీలను సందర్శించి వైద్య సేవలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా డాక్టర్లు ఉదయం 8.50గంటలకే ఆస్పత్రికి చేరుకొని.. అక్కడి నుంచే గూగుల్ మీట్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకున్నారు. గూగుల్ మీట్‌లో స్వయంగా కలెక్టర్ పాల్గొని వైద్యులకు సూచనలు చేస్తుండటంతో పాటు నేరుగా అక్కడి రోగులతో ముచ్చటిస్తున్నారు. దీంతో డాక్టర్ల సమయపాలన మెరుగు కావడంతోపాటు రోగులకు వైద్య సదుపాయాలు అందుతున్నాయి.


సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు, చిన్నారులు

## పిల్లలతో కలిసి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

- 13వ రోజూ కొనసాగిన ఆందోళన

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 22 : తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు వారి పిల్లలు సైతం నడుం బిగించారు. తమ తల్లిదండ్రులు చేస్తున్న న్యాయ పోరాటంలో పాల్గొని బాసటగా నిలిచారు. కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టిన సమ్మె ఆదివారం 13వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ఉద్యోగులు, వారి పిల్లలు డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దుండిగల్ యాదగిరి, ఝాన్సీ జూమ్ సమావేశంలో సమ్మెను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం దిగి వచ్చి డిమాండ్లను నెరవేర్చే వరకు, ఎన్ని అడ్డంకులు వచ్చినా సమ్మెను ఆపే ప్రసక్తే లేదన్నారు. 13 నుంచి 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను వెట్టి చాకిరి చేయించుకుంటూ సహనాన్ని పరిశీలిస్తున్నారని తెలిపారు. రెండు రోజుల్లో ఎలాంటి ప్రకటన రాకుంటే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంగ పాండరి, తిరుపతి, నాయకులు నాగార్జున, అరుణ, సంధ్యారాణి, సునీత, దుర్గ పాల్గొన్నారు.


నల్లగొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఓపెన్ స్కూల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అరుణశ్రీ

## ఉన్నత విద్య చదువాలనుకునే వారికి గొప్ప వరం ఓపెన్ స్కూల్

- ఓపెన్ స్కూల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ అరుణశ్రీ

రామగిరి, డిసెంబర్ 22: ఉన్నత చదువులు చదువాలనే కోరికతో ఉండి మధ్యలో చదువులు మానేసిన యువతీ, యువకుకు ఓపెన్ స్కూల్ గొప్ప వరం అని ఓపెన్ స్కూల్ సోసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎం.అరుణశ్రీ అన్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఆదివారం ఆమె పలు ఓపెన్ టెన్త్, ఇంటర్ తరగతుల నిర్వహణను పరిశీలించారు. నల్లగొండలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోని ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడారు. తరగతుల నిర్వహణ, ప్రాక్టికల్స్, ఇతర అంశాలను తెలుసుకున్నారు. రెగ్యులర్‌గా తరగతుల నిర్వహణ, హాజరు పట్టిక ఇతర అంశాలను పరిశీలించి సంతృప్తి చెంది ఆ కళాశాల ప్రిన్సిపాల్ టి.సుధారాణిని అభినందించారు. అదే విధంగా గొల్లగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల డైట్‌ను ఆమె సందర్శించారు. అనంతరం నకిరేకల్, సూర్యాపేటలోని పలు స్టడీసెంటర్స్‌కు వెళ్లారు. ఆమె వెంట నల్లగొండ ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కల్లూరి సత్తమ్మ , జిల్లా ఓపెన్ స్కూల్ సీనియర్ అసిస్టెంట్ రమేశ్‌రెడ్డి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.సుధారాణి, స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ తండు స్వామి, అధ్యాపకులు కిరణ్, గోవర్ధన్, ప్రవీణ్‌కుమార్, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పద్య నాటక పోటీల్లో 'రావణ' నాటకానికి నాలుగు అవార్డులు

మిర్యాలగూడ, డిసెంబర్ 22: ఈ నెల 12 నుంచి 20 వరకు బావనపల్లి పరమేశ్, పాండవుల హరిప్రసాద్ ఆధ్వర్యంలో శివానీ ఆర్ట్స్ అసోసియేషన్ వారు హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పద్య నాటక పోటీల్లో మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం వారు ప్రదర్శించిన రావణ నాటకానికి నాలుగు అవార్డులు దక్కాయి. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో సాంస్కృతిక కళా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు బోయినపల్లి భుజంగరావు, పులి కృష్ణమూర్తిశర్మ మాట్లాడారు. ఈ నెల 13న ప్రదర్శించిన రావణ నాటకానికి నాలుగు అవార్డులు, జ్యూరీ అవార్డు ప్రకటించినట్లు తెలిపారు. ఉత్తమ నటుడిగా బోయినపల్లి భుజంగరావు, ఉత్తమ సహాయ నటులుగా పుల్లాభట్ల వెంకటలక్ష్మి నారాయణ శర్మ, ఉత్తమ సంగీతం సురభి కొండలరావు, వ్యక్తిగత ఉత్తమ జ్యూరీగా కంబాల శ్రీనివాస్, ఉత్తమ జ్యూరీ నాటకం రావణ బహుమతులు అందుకున్నట్లు చెప్పారు. బహుమతులను నాటిక సమాజాల సమాఖ్య వ్యవస్థాపకుడు తడకమళ్ల రామచందర్‌రావు, అధ్యక్షుడు ఆకుల సందానందం, హరిప్రసాద్, పరమేశం చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు.

## ఏడేండ్లుగా మంచానికే పరిమితం

- స్తంభం పైనుంచి పడడంతో విరిగిన రెండు కాళ్లు
- అవస్థలు పడుతున్న రమావత్ లాలు
- పింఛన్ మంజూరు చేయని అధికారులు

చందంపేట, డిసెంబర్ 22 : పొట్ట కూటి కోసం సొంత ఊరిని వదిలి బెంగళూరుకు వెళ్లాడు. పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న అతని జీవితంలో అనుకోని విపత్తు సంభవించింది. కరెంటు స్తంభంపై నుంచి జారిపడడంతో రెండు కాళ్లు విరిగిపోయి ఇంటి వద్ద జీవచ్ఛవంలా బతుకీడుస్తున్నాడు. ఏడేండ్లుగా మంచానికే పరిమితమైన రమావత్ లాలు పింఛన్ కోసం ఎన్నో అగచాట్లు పడ్డాడు. అధికారుల ఉదాసీనతతో పింఛన్‌కు మాత్రం పొందలేకపోయాడు. చందంపేట మండలంలోని గన్నెర్లపల్లి గ్రామ పరిధి ధర్మతండాకు చెందిన రమావత్ లాలు, ఆర్.జ్యోతి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలీనాలి చేస్తూ జీవనం సాగించే రమావత్ లాలు జీవనోపాధి నిమిత్తం సొంత ఊరిని కాదనుకొని బెంగళూరుకు వెళ్లాడు. అక్కడ కొన్నాళ్ల పాటు బాగానే సాగినా ఓ రోజు కరెంటు స్తంభంపై పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి.


మంచానికే పరిమితమైన రమావత్ లాలు

ఇందుకు రూ.12లక్షల వరకు ఖర్చు అయ్యిందని లాలు ఆవేదనతో చెప్తున్నాడు. రెండు కాళ్లు విరిగిపోవడంతో సుమారు ఏడు సంవత్సరాలుగా ఇంటి వద్ద మంచానికే పరిమితం అయ్యాడు. రెండు కాళ్లు లేక ఏ పనిచేయలేకపోతున్నానని, తన కుటుంబ జీవనాధారానికి పింఛన్ మంజూరు చేయాని ఎన్నో మార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని రమావత్ లాలు కన్నీటి పర్యంతమవుతున్నాడు. ఇప్పటికైనా పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

# అతివలకు ఉపాధి హామీ

## సింహభాగం మహిళలకే..

- ఆరు రకాల పనులకు ప్రాధాన్యం
- వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు


నేరేడుచర్ల మండలం దిర్శించర్లలో ఉపాధి హామీ పనులు (ఫైల్)

నేరేడుచర్ల, డిసెంబర్ 22 : ఉపాధి హామీ పనుల్లో సింహ భాగం మహిళలకు కల్పించాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. 2025–26 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నాటికి ఉపాధి హామీ పథకంలో భాగంగా గుర్తించిన పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పనులను వేగవంతం చేసింది. గత అక్టోబర్ 2 నుంచి గ్రామ సభల్లో ఆమోదించిన పనులు వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పూర్తి చేయడానికి మండల యూనిట్‌గా ఈ పనులు సకాలంలో పూర్తి చేయాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా గ్రామాణాభివృద్ధి శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వం సూచించిన 6 రకాల పనులు ప్రారంభించనున్నారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టాల్సిన పనులను గుర్తించారు. సింహభాగం మహిళలకు భాగస్వామ్యం కల్పించాలని నిర్ణయించారు.

### మహిళా శక్తికి భరోసా..

మహిళా సంఘాల సభ్యులందరికీ ఉపాధి భరోసా కల్పించేలా ఉపాధి పథకంలో భాగస్వాములను చేయనున్నారు. వారిని స్వయం ఉపాధి వైపు మళ్లించేలా రుణాలిచ్చి ఆవులు, మేకల పెంపకం చేపట్టేలా చేస్తారు. పశువుల షెడ్లు, వర్మీ కంపోస్టు, అజోం మొక్కల పెంపకం, బీడు భూముల అభివృద్ధి వంటివి చేపట్టవచ్చు.

**ఉమ్మడి జిల్లాలో వివరాలు**

| జిల్లా | మండలాలు | పంచాయతీలు | జాబ్‌కార్డులు | కూలీలు |
|---|---|---|---|---|
| సూర్యాపేట | 23 | 475 | 2,62,533 | 5,70,684 |
| నల్లగొండ | 31 | 844 | 3,59,476 | 7,64,194 |
| యాదాద్రి | 17 | 421 | 1,42,125 | 2,63,388 |

### పొలం బాటలు

గ్రామాల్లో పంట ఉత్పత్తులను ఇంటికి చేర్చడానికి ఈ సారి మట్టిదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. దీని కోసం ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి వాటికి అనుగుణంగా చేపట్టనున్నారు.

### ఫలాలు, వనాలు

ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటల ద్వారా రైతులను ప్రోత్సహించడం, వాటికి రాయితీపై బిందు, తుంపర్ల పరికరాలు ఇచ్చేలా చేస్తారు. ఈత తాటి వనాలు పెంచుతున్నారు. జిల్లాలో ఎంపిక చేసిన నర్సరీల్లో ఈ పనులు చేపట్టనున్నారు.

### జలనిధి

జల సంరక్షణలో ప్రజలను భాగసామ్యం చేయడం, ఇంటింటా ఇంకుడు గుంతలు, ఫాం పాండ్లు, ఇంటి కప్పు భాగంలో కురిసన నీటిని భూగర్భంలోకి ఇంకించడం, చేతి పంపుల వద్ద ఇంకుడు గుంతలు, కందకాలు తవ్వడం, చెక్‌డ్యాం కట్టేలా చర్యలు తీసుకోనున్నారు.

### గ్రామీణ పారిశుధ్యం

గ్రామాల్లో వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపటనున్నారు. ఒక్కో మండలంలో కనీసం 10 చొప్పున ఇంకుడు గుంతలను నిర్మించాలని లక్ష్యం పెట్టుకున్నారు.

### మౌలిక సదుపాయాలు

గ్రామాల్లోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో బాలికలు, బాలురకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు, సిమ్మెంట్ రహదారులు నిర్మాణం, అంగన్‌వాడీ భవనాలు నిర్మించనున్నారు. ప్రతి మండలంలో ఈ పనులు ఒకటి లేదా రెండు చొప్పున తొలి విడుత చేపట్టనున్నారు.